క్లుప్తంగా

10న 'కొండమూరి' విగ్రహావిష్కరణ

కపిలేశ్వరపురం: అంగరలో ఈనెల 10వ తేదీన ఆర్‌ఎంపీ వైద్యుల ఆరాధ్య దైవంగా పేరొందిన, కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన డాక్టర్ కొండమూరి నరసింహమూర్తి నిలువెత్తు విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఆ మేరకు పీఎంపీ అసోసియేషన్ నాయకులు గంగుమళ్ల రాంబాబు మాట్లాడుతూ కొండమూరి చేతులు మీదుగా వైద్యం నేర్చుకున్నవారు కపిలేశ్వరపురం మండలంతో పాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అనేక ప్రాంతాల్లో ప్రైవేటు వైద్య వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఆ అభిమానంతో అంగర గ్రామం ప్రధాన రహదారిలో కొండమూరి విగ్రహాన్ని నెలకొల్పామని రాంబాబు తెలిపారు.

యూటీఎఫ్ ఆర్థిక సాయం



ఉపాధ్యాయిని కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న యూటీఎఫ్ సభ్యులు

కాజులూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పినిపే శేషమహాలక్ష్మి కుటుంబ సభ్యులకు యూటీఎఫ్ సంఘ సభ్యులు ఆర్థిక సహకారం అందజేశారు. మండలంలోని తిప్పరాజుపాలెం గ్రామ శివారు అంచమ్మచెరువు మండల పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న పినిపే శేషమహాలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకరవర్మ, సంఘం మండల అధ్యక్షుడు వి.భానుప్రకాశ్, ప్రధాన కార్యదర్శి ఎన్.ప్రవీణ్ తదితరులు ఆదివారం శేషమహాలక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శించి యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ పథకం ద్వారా ఆమె భర్త నాగేశ్వరరావుకు రూ.మూడు లక్షల ఆర్థిక సహకారం చెక్కు రూపంలోఅందజేశారు. విధి నిర్వహణలో శేషమహాలక్ష్మి సేవలను ఉపాధ్యాయులు కొనియాడారు.

అశ్లీల నృత్యాల కేసులో నిందితులపై చర్యలు తీసుకోవాలి



మీడియాతో మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు సాయిరామ్

మండపేట: అశ్లీల నృత్యాల కేసులోని నిందితులపై చట్టరీత్యా తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ మండపేట నియోజకవర్గ కన్వీనర్ కేవీవీ సాయిరామ్ డిమాండ్ చేశారు. ఊరి నడిబొడ్డున సమాజం తలదించుకునేలా రేవ్ పార్టీలు నిర్వహించడం దారుణమన్నారు. మండపేటలో మునుపెన్నడూ లేని నీచ సంస్కృతికి నిందితులు ఒడిగట్టడం హేయనీయమన్నారు. భారతదేశ దైవాంశ సంభూతుడైన తదాగతునికి అవమానం తెచ్చేలా ప్రవర్తించడం సహించరానిదని ఖండించారు. బుద్ధ భగవానుని ఎదుట ఇటువంటి అశ్లీల నృత్యాలు, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించారంటే వీళ్లు మనుషులేనా అని ఏవగించుకున్నారు. సంఘం శరణం గచ్చామి బుద్ధం శరణం గచ్చామి అనే మన సంస్కృతీ సాంప్రదాయాలకు తిలోదకాలిచ్చారని ఆయన మండిపడ్డారు.

బాబాకు పట్టాభి పరామర్శ



బాబాను పరామర్శిస్తున్న పట్టాభి

మండపేట: షేక్ అండ్ షేక్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, మైనారిటీ సెల్ నాయకుడు షేక్ అలీఖాన్‌బాబా తల్లి ఇటీవల వృద్ధాప్యంతో మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులను జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి ఆదివారం పరామర్శించారు. పరామర్శలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్కా సింహాచలం, ఆ పార్టీ నాయకులు కనికెళ్ల ప్రసాద్, మేడిశెట్టి సూర్యభాస్కరరావు, కేతిన శ్రీనివాస్ వున్నారు.

నమోదు గడువు పెంచాలి



నరాల కృష్ణకుమార్

రామచంద్రపురం రూరల్: రాబోయే వేసవిలో చేపట్టబోయే ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల నిమిత్తం సీఎస్‌సీ వైబ్‌సైట్‌లో సుమారు 1.87 లక్షల మంది ఉపాధ్యాయులు 136 అంశాలతో కూడిన తమ సర్వీసు వివరాలను నమోదు చేయాల్సిన అవసరం ఉందని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు నరాల కృష్ణకుమార్ ఆదివారం విలేకరులకు తెలిపారు. అయితే ఇందుకు సంబంధించిన సర్వర్ పూర్తి స్థాయిలో పనిచేయకపోవడంతో ఉపాధ్యాయులు చాలా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నమోదుకు గడువు ప్రస్తుతం పండగ వరకు పెంచినట్లు సమాచారం ఇచ్చారన్నారు. అయితే సర్వర్ పూర్తిక స్థాయిలో పనిచేయని కారణంగా ఈ గడువును జనవరి నెలాఖరు వరకు పెంచాలని అలాగే సర్వర్ సామర్థ్యాన్ని కూడా పెంచాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పెరుగుతున్న పట్టణ విస్తీర్ణం

- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న లే అవుట్లు
- అభివృద్ధికి నోచుకోని రోడ్లు, డ్రైన్లు



వీఎస్ఎం కళాశాలకు ఎదురుగా అధ్వానంగా మారిన రోడ్డు

రామచంద్రపురం: మున్సిపాలిటీని ఆనుకుని ఉన్న గ్రామ, పట్టణ శివార్లు ఏకమవుతున్నాయి. కానీ పట్టణ పరిధిలో నూతనంగా విస్తీర్ణం పెరుగుతున్న దానికి అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయడంలో ముందుచూపు కొరవడింది. విద్య, వైద్యం తదితర రంగాల్లో వస్తున్న మార్పుల నేపథ్యంలో పురపాలక సంఘ పరిధి ఏటా విస్తరిస్తుంది. పట్టణానికి ఆనుకుని ఉన్న గ్రామాల వైపు గృహాలు విస్తరిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో కనీస సౌకర్యాల కల్పన లేకపోవడంతో విస్తరించిన ప్రాంతంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోక తప్పడం లేదు.

పెరుగుతున్న పట్టణ విస్తీర్ణం

పట్టణ శివారు ప్రాంతాల్లో రోజుకో లేఅవుట్ చొప్పున పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. పురపాలక నిబంధనల ప్రకారం రోడ్లు, డ్రైన్‌లు, విద్యుత్ లాంటి సౌకర్యాలు కల్పించాల్సి ఉన్నా, వాటిని నామమాత్రంగానే చూపించి అధికారులు కళ్లు కప్పుతున్నారు. దీంతో లేఅవుట్లకు పర్మిషన్లు తెచ్చుకుని యథేచ్ఛగా స్థలాలకు విక్రయించి ఆయా స్థలాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో చేతులెత్తేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతం అభివృద్ధికి దూరంగానే ఉంటుంది. ప్రజల వద్ద నుంచి అధిక రేట్లకు లేఅవుట్ స్థలాలను విక్రయిస్తున్నా.. డ్రైనేజీ అవుట్ లెట్‌లను ఏర్పాటు చేయడం లేదు. దీంతో ఆయా లేఅవుట్లలో మురుగునీరు పారేందుకు మార్గాలు లేక భవిష్యత్తులో ఇబ్బందులుల ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి.

కానరాని ముందస్తు చర్యలు

గతంలో పట్టణ విస్తీర్ణం 13.2 చదరపు కిలోమీటర్లు ఉండేది. కానీ పదేళ్లగా పట్టణ విస్తీర్ణం విపరీతంగా పెరుగుతూ వచ్చింది. పట్టణ శివారు ప్రాంతాలైన ముచ్చుమిల్లి, వీఎస్ఎం కళాశాల ప్రాంతం, పసలపూడిరోడ్డు, బైపాస్ రోడ్డు, ద్రాక్షారామ రోడ్డు, శీలంవారిసావరం-యనమదల, వెల్ల రోడ్డు, తోటవారివీధి, ఆర్టీసీ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో కొత్తగా లేఅవుట్లు అభివృద్ధి చేశారు. ఇటీవల వీఎస్ఎం కళాశాల ఎదురుగా, బైపాస్ రోడ్డులో లేఅవుట్ పెరిగి గృహనిర్మాణాలు జోరందుకున్నాయి. దీంతో దాదాపుగా పది చదరపు కిలోమీటర్లు మేర పట్టణ విస్తీర్ణం పెరిగినట్లు అంచనా. కానీ తదనుగుణంగా సౌకర్యాలు మాత్రం పెరగడం లేదు. రోడ్లు, డ్రైనేజీలకు అవుట్‌లెట్‌లు ఏర్పాటు చేయడంలో ముందస్తు ప్రణాళికలు లేకుండా పోయాయి.

సదుపాయాల కల్పన ఎప్పుడో..?

ప్రస్తుతం పట్టణలో మున్సిపాలిటీ ఆవిర్భావం నుంచి 27 వార్డులుగానే ఉంది. విస్తీర్ణం పెరుగుతున్నా వాటి స్వభావం మాత్రం అలాగే ఉంది. తాజాగా పట్టణ పరిసర ప్రాంతాల్లో అధికారికంగా 5 లేఅవుట్లకు పైగా వెలిశాయి. పట్టణానికి ఆనుకుని ఉన్న పసలపూడి పంచాయతీ పరిధిలో కూడా కుప్పలు తెప్పలుగా లేఅవుట్లు వస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న వార్డులో ప్రస్తుతం 1955 వీధిలైట్లు ఉన్నాయి. కాని వాటి సంఖ్య పెంచాల్సి ఉంది. గత ప్రభుత్వం మున్సిపాలిటీ వీధిలైట్లను ఎల్‌ఈడీలుగా మార్చారు. అయితే పెరిగిన పట్టణ విస్తీర్ణంతో వీధిలైట్ల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉంది. పట్టణంలో గత జనాభా లెక్కల ప్రకారం 43,683 మంది జనాభా ఉండగా.. కుటుంబాల సంఖ్య 12,500 ఉండగా ప్రస్తుతం వీటి సంఖ్యల 5 వేలకు పైగా పెరిగినట్లు అంచనా. వీరికి సరిపడా తాగునీటి సౌకర్యం లేదు. ఇప్పటికే పట్టణంలో సుమారుగా 9 వార్డులకు పైగా తాగునీటి సౌకర్యం లేదు. పట్టణంలో మురికివాడలతో పాటుగా ఇతర ప్రాంతాల్లో 385 చేతి పంపులున్నాయి. పట్టణాభివృద్ధి కోసం ప్రణాళికాబద్ధంగా శివారు ప్రాంతాలను అభివృద్ధికి నిధులు కేటాయించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

ఏకగ్రీవంగా మండల బీజేపీ అధ్యక్షుడి ఎన్నిక



మండల బీజేపీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన శివాజీకి నియామక పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

కాజులూరు: మండల బీజేపీ నూతన అధ్యక్షుడి ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జిల్లా ఎన్నికల పరిశీలకులు పాలూరి సత్యానందం, నియోజకవర్గ పరిశీలకులు చాట్రాతి రాంబాబు, మండల ఆర్వో కొట్టువాడ హరిబాబుల ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. జగన్నాథగిరి ఎంపీటీసీ, పార్టీ జిల్లా కార్యదర్శి కొప్పన లక్ష్మి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్న పుణ్యమంతుల శివాజీ పేరును ప్రతిపాదించగా సభ్యులు ఆమోదించడంతో మండల పార్టీ అధ్యక్షుడిగా శివాజీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు పరిశీలకులు ప్రకటించారు. తాజా మాజీ అధ్యక్షుడు సలాది వీరబాబు, నియోజకవర్గ కో కన్వీనర్ సలాది శేఖర్, రామచంద్రపురం పట్టణ, రూరల్ అధ్యక్షులు కేశవ రాఘవేంద్ర, ఆకేటి శ్రీకృష్ణ, పార్టీ నాయకులు దేవు పట్టాభి, నిమ్మన రాజేష్, దున్నే శ్రీనివాస్ తదితరులు నూతన అధ్యక్షుడికి అభినందనలు తెలిపారు.

సంక్రాంతికి ఊరెళ్తున్నారా..
అయితే ఈ జాగ్రత్తలు తీసుకోవాలి



డి.సురేష్‌బాబు

రాయవరం: సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఊర్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు సూచిస్తున్నారు. పండగ సెలవులకు ఊర్లే సమయంలో దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశముంటుందన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన సూచిస్తున్నారు. ।దూర ప్రాంతాలకు వెళ్లే వారు తమ ఇంటి చిరునామా, ఫోన్ నంబరును పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలి. ఊర్లే వారి వివరాలను నమోదు చేసుకుని ఆయా ఇళ్లపై నిఘాను ఏర్పాటు చేస్తాం. తమ కాలనీలు, ఇళ్లు, పరిసరాలు, షాపింగ్ మాల్స్‌లో సీసీ కెమెరాలు అమర్చుకోవాలి. పని మనుషులు ఉంటే రోజూ వాకిలి ఊడ్చమని చెప్పాలి. ఆరు బయట వాహనాలకు హ్యాండిల్ లాక్‌తో పాటు ఏదైనా చైన్‌తో వీల్‌లాక్ చేసుకోవాలి. టైమర్‌తో కూడిన లైట్లను ఇంట్లో అమర్చుకోవాలి. హోమ్ సెక్యూరిటీ సిస్టం ద్వారా ఇంటర్నెట్ అనుసంధానం ఉన్న మొబైల్ నుంచే ప్రజలు వారి ఇంటిని ఎక్కడి నుంచైనా లైవ్‌లో చూసుకునే వీలుంది. అవకాశం ఉన్నవారు వీటిని ఏర్పాటు చేసుకోవాలి. నాణ్యమైన సీసీ టీవీలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నందున ఇళ్లకు అమర్చుకుంటే మంచిది. కొత్త వ్యక్తుల కదలికలపై స్థానికులు ప్రత్యేక దృష్టి సారించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. సెలవులకు ఊర్లే ప్రతి ఒక్కరూ పోలీస్‌స్టేషన్ నంబరును అందుబాటులో ఉంచుకోవాలి. ప్రజలు నిరంతరం పోలీసులతో సహకరిస్తే చోరీలను నియంత్రించడం సులభమవుతుందన్నారు. దూరప్రాంతాలకు వెళ్లే వారు ముందుగా తెలియజేస్తే లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్‌ఎంఎస్)ను ఏర్పాటు చేసి, నిరంతరం పర్యవేక్షణ చేస్తాం. ఏ సమాచారం ఉన్నా డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన దేగల వీరపవన్, దడాల సంజన

కాజులూరు: జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు కాజులూరు మండలం గొల్లపాలెం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం పాఠశాలలో స్కూల్ పీడీ జి.సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల కాకినాడ, అనంతపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి దేగల వీరపవన్, తొమ్మిదో తరగతి విద్యార్థిని దడాల సంజన పాల్గొని చక్కని ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈనెల ఆరో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకూ మహారాష్ట్రలోని జల్గాన్‌లో జరగనున్న జాతీయస్థాయి అండర్-17 సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాష్ట్ర టీమ్ తరపున పోటీపడనున్నారన్నారు. స్కూల్ హెచ్‌ఎం పి.సుశీలమణి, సర్పంచ్ పోతురాజు ప్రసన్నమౌనిక, ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరిదేవి, ఎంపీటీసీ జొన్నకూటి పద్మాజ, స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ కొల్లిశెట్టి సత్యం, తదితరులు జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

దివ్యాంగ పింఛన్ల తొలగింపునకు చర్యలు

రాయవరం: ఆర్థిక భారాన్ని సాకుగా చూపి దివ్యాంగుల పింఛన్లను శాశ్వతంగా తొలగించే కుట్రను కూటమి ప్రభుత్వం చేస్తోందని అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖండవిల్లి భరత్‌కుమార్ ఆరోపించారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దివ్యాంగుల పింఛన్లు పొందుతున్న సుమారు 8 లక్షల మంది లబ్ధిదారులను దొంగలుగా కూటమి సర్కార్ చిత్రీకరిస్తుందన్నారు. 2019 -24 మధ్యకాలంలో దివ్యాంగుల పింఛన్లు పొందుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించడం తాము స్వాగతిస్తామన్నారు. 2010 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం పకడ్బందీగా నిర్వహించిన సదరం ధ్రువీకరణ పత్రాలను దివ్యాంగులకు తిరిగి వైద్య పరీక్షలు నిర్వహించడాన్ని ఆయన తప్పుబట్టారు. గతంలో జారీ చేసిన పత్రాలు జారీ చేసిన ప్రభుత్వ వైద్యులను అవమానించడమేనన్నారు. తనిఖీల పేరుతో అర్హులైన దివ్యాంగులను వేధిస్తే రాష్ట్రవ్యాప్త ఉద్యమాలకు పిలుపునిస్తామని భరత్‌కుమార్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గోల్డెన్ జూబ్లీ ఫంక్షన్‌లో సందడి చేసిన పూర్వ విద్యార్థులు

మండపేట: ఆ స్నేహానికి 50 ఏళ్లు. స్నేహం బంధం నేటికి పదిలంగా ఉందని మండపేట జూనియర్ కాలేజీలో చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిరూపించింది. 1975లో పదోతరగతి విద్యను అభ్యసించి దేశ విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులందరూ కలుసుకోవడానికి పట్టణంలోని ఏడిద రోడ్డులోని వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ జూనియర్ కళాశాల వేదికగా మారింది. ఆదివారం పూర్వ విద్యార్థులు గోల్డెన్ జూబ్లీ మహోత్సవం కనుల పండవగా నిర్వహించారు.. స్థానిక శాసన సభ్యుడు వేగుళ్ల జోగేశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేసి స్నేహం గొప్పతనాన్ని కొనియాడారు. అనంతరం అప్పటి తెలుగు ఉపాధ్యాయులు గుంటూరు శ్యామ్‌సుందర్ శర్మ, లెక్కలు మాస్టారు అద్దంకి వీర్రాజులను ఘనంగా సన్మానించారు. జ్ఞాపికలను అందించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులందరూ పాఠశాలలో పదో తరగతిలో టాపర్‌గా నిలిచిన వారికి రూ.10 వేలు ప్రోత్సాహక నగదు ఇవ్వడానికి నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. అనంతరం వారంతా కలిసి సహపంక్తి భోజనాలు చేసి ఆనందాన్ని పంచుకున్నారు.

విజయవాడ తరలిన బజరంగ్ దళ్ కార్యకర్తలు



శంఖారావం సభకు తరలివెళ్తున్న బజరంగ్ దళ్ సభ్యులు

మండపేట: విజయవాడ సమీపంలోని కేసరపల్లిలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో తలపెట్టిన హైందవ శంఖారావం సభకు మండపేట నుంచి బీజేపీ కార్యకర్తలు, నాయకులు, జై బజరంగ్ హిందూ ఐక్య వేదిక సభ్యులు తరలి వెళ్లారు. బీజేపీ మండపేట నియోజకవర్గ కన్వీనర్ కేవీవీ సాయిరామ్ మాట్లాడుతూ మండపేట నియోజకవర్గం నుంచి 17 బస్సులో బజరంగ్ దళ్ సభ్యులు, బీజేపీ కార్యకర్తలు, హిందూత్వ వాదులు తరలివెళ్లినట్టు చెప్పారు. మత సామరస్యాన్ని దెబ్బతీసే విధంగా మండపేటలో కొంతమంది అన్యమతస్తులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రత్యేకించి సంప్రదాయ పండగలైన భోగి, సంక్రాంతి, కనుమ పండగల్లో అన్యమత ప్రచారం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మత సామరస్యాన్ని దెబ్బతీసే ఇటువంటి సభలు, సమావేశాలకు పోలీసులు ఎటువంటి అనుమతులు ఇవ్వరాదని కోరారు. వారి సభలను హిందూ పండుగలు అనంతరం జరుపుకొనేలా ఏర్పాట్లు చేయాలని ఆయన పోలీసులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి అయినవిల్లి రాజరాజేశ్వర రుద్రశర్మ, కోటిపల్లి కృష్ణమాచార్యులు, సాక్షి వెంకటరమణ, నాళం ఫణిప్రకాష్, గొడవర్తి రామచంద్రరావు, మద్దుల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక

44 సంవత్సరాల తర్వాత కలసిన పూర్వ విద్యార్థులు



రాయవరంలో కలుసుకున్న 1972-79 పూర్వ విద్యార్థులు

రాయవరం: దాదాపు 44 సంవత్సరాల అనంతరం పూర్వ విద్యార్థులంతా ఒకే వేదికపై కలిశారు. తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి ఆదివారం రాయవరం శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల వేదికగా నిలిచింది. 1972-79 సంవత్సరాలలో రాయవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ఆ విద్యార్థులంతా విద్యాభ్యాసం చేశారు. తిరిగి వారంతా కలుసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని భావించారు. వారంతా కలిసి రూ.6 లక్షల వరకు శాశ్వత నిర్మాణానికి విరాళంగా ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. ఇదే విషయాన్ని పాఠశాల హెచ్‌ఎం వీఎస్ సునీతకు తెలిపారు. పూర్వ విద్యార్థుల అపూర్వ కలయికకు కృషి చేసిన ఆర్‌వీవీ సత్యనారాయణచౌదరిని దుశ్శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. పూర్వ విద్యార్థులంతా కలిసి మరోసారి పాఠశాల ఆవరణలో తీపి జ్ఞాపకంగా గ్రూపు ఫొటో దిగారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తాడి వెంకటలక్ష్మి, నారాయణరెడ్డి, మల్లిడి సూరారెడ్డి, నిడసనమెట్ల సత్యకాశీఈశ్వరరావు, కె.నాగమోహన్‌రావు, కర్రి వెంకటరెడ్డి, కాకి రామకృష్ణ, కర్రి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల ఫోన్ నంబర్లు

ౖమండపేట మండల స్థాయి అధికారుల ఫోన్ నంబర్లు

1. తహసీల్దార్	పి.తేజేశ్వరరావు	9849903903
2. ఎంపీడీవో	కె.సత్యనారాయణమూర్తి	9391973013
3. ఈవోఈఆర్డీ	డీ.శ్రీనివాస్	9951657999
4. మున్సిపల్ కమిషనర్	టీవీ రంగారావు	9849905809
5. ఎంఈవో-1 నాయుడు	రామచంద్రరావు	9440511749
6. ఎంఈవో-2	సీహెచ్‌వీ సోమిరెడ్డి	9441145835
7. మండల ఇంజినీరింగ్ అధికారి	వి.నాగేశ్వరరావు	8977115105
8. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ	డీ.చైతన్యకుమారి	9100121182
9. ఆర్‌అండ్‌బీ ఏఈ	టీవీఎస్ సూర్యనారాయణ	9440818538
10. ఎలక్ట్రికల్ ఏఈ	బి.రవికుమార్	9440812648
11. హౌసింగ్ ఏఈ	పీవీవీ సత్యనారాయణమూర్తి	7093930491
12. ఇరిగేషన్ ఏఈ	అజీజ్	8500786756
13. వ్యవసాయ అధికారి	కే.ఏసుబాబు	8331056558
14. మత్స్యశాఖాధికారి	విళ్ల రమణరావు	8331953607
15. ఎంఎస్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో	వీవీవీ సత్యనారాయణమూర్తి	7702072569
16. రూరల్ ఎస్‌ఐ	శివకుమార్	9440797592
17. వెలుగు ఏపీఎం	కే.రవిరాజు	9849901695
18. సీడీపీవో	గజలక్ష్మి	6302169085
19. ఐసీడీఎస్ సూపర్‌వైజర్	ద్వారపూడి సెక్టార్	9381215076
20. ఐసీడీఎస్ సూపర్‌వైజర్	ఏడిద సెక్టార్	9030301587
21. వైద్యాధికారిణి	సీహెచ్ రమ్యశ్రీ	9652502519
22. వైద్యాధికారి	పీ.జగదీప్	9494029992
23. వైద్యాధికారిణి	లత	9177724823
24. వైద్యాధికారి	సూర్యనారాయణరెడ్డి	9849131854
25. పశువైద్యాధికారి	రాజ్‌కుమార్	7989535625

ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం..



ప్రజలు ప్రయాణించడానికి భయపడుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ రహదారి

రామచంద్రపురం రూరల్: ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం ఆ దారిలో ప్రయాణించే ప్రజలకు శాపంగా పరిణమించింది. వివరాల్లోకి వెళితే ద్రాక్షారామ ప్రధాన రహదారి నుంచి ద్రాక్షారామ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లే రహదారి ప్రధాన రహదారి పనులు చేసేటప్పుడు శిథిలమైంది. సరిగ్గా ఈ రోడ్డును ఆనుకునే మురికి డ్రైన్ రోడ్డు అడుగున ఉండటంతో అధికారుల సూచనల మేరకు కాంట్రాక్టర్ ఇక్కడ తూరలను ఏర్పాటు చేశారు. ఈ తూరలు ఏర్పాటు చేసే సమయంలో జేసీబీతో తూరలు వేయడానికి తవ్వకాలు జరిపేటప్పుడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ రహదారిని కూడా జేసీబీతో తవ్వించేశారు. అయితే తూరల పని పూర్తయిన తరువాత తాము తవ్వించిన చోట సరిచేయకుండా వదిలి పెట్టేశారు. దీంతో ఈ ప్రాంతం ప్రమాదాలకు నెలవుగా మారింది. అనేక మంది మోటారు సైకిళ్లపై వెళ్లే పెద్ద వయస్సు వాళ్లు, సైకిళ్లపై పాఠశాలలకు వెళ్లే చిన్నారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సుమారు 6 నెలలకు పైగా ఇదే దుస్థితి కొనసాగుతోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి దగ్గరి దారి కావడంతో అనేక మంది కార్లపై వస్తుంటారు. వారు సైతం ఈ రోడ్డులోకి భయపడుతూ ప్రవేశిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు ఇక్కడ సమస్యని పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రభల ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి

- అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు
- రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్
- ఉత్సవ కమిటీలతో సమీక్ష



కొత్తపేట ప్రభల ఉత్సవ కమిటీ సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ విద్యాసాగర్

కొత్తపేట: మకర సంక్రాంతి సందర్భంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే కొత్తపేట ప్రభల ఉత్సవాలు శాంతియుతంగా జరిగేలా ఉత్సవ కమిటీ అన్ని చర్యలు తీసుకోవాలని రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ సూచించారు. కొత్తపేట మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ప్రభల ఉత్సవ కమిటీ సభ్యులతో ఎస్సై జి.సురేంద్ర అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. సమావేశంలో సీఐ ముఖ్యఅతిథిగా పాల్గొని పలు సూచనలు చేశారు. ప్రభల ఉత్సవాల్లో అశ్లీల నృత్యాలకు తావు లేదని స్పష్టం చేశారు. నిబంధనలకు లోబడి ఉత్సవాలు జరుపుకోవాలని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభల ఊరేగింపులో, బాణసంచా కాల్పుల సమయంలో ఉత్సవాల నిర్వాహకులు పూర్తి బాధ్యత తీసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా సంబంధిత వ్యక్తులతో పాటు నిర్వాహకులపై కూడా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ప్రభల ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో ప్రజలు సంతోషంగా జరుపుకొనేలా సమన్వయంతో పనిచేయాలని, పోలీసులు తీసుకునే చర్యలకు సహకరించాలని కోరారు. సమావేశంలో కొత్త రామాలయం ఉత్సవ కమిటీ కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, చింతం సురేష్, పాత రామాలయం ఉత్సవ కమిటీ సభ్యులు ముద్రగడ సుబ్బారావు, సలాది మావాజీ, కనకాల నాగబంగారం, నిమ్మకాయల చిన్నయ్యనాయుడు, బోడిపాలెం ఉత్సవ కమిటీ సభ్యులు అన్యం సత్తిరాజు, బోడపనీడి గోవిందు తదితరులు పాల్గొన్నారు.